VASANTH KUMAR
Director
QUALITY SERVICE SINCE 1997
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K. U.S.A., New Zealand)
1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
91(40) 27628104, 27674007
victoria.ashoknagar@gmail.com
://www.victoriaoverseas.com
AAERI MEMBER QEAC No. E334

# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

MAHESH KUMAR KOVURY CELL 9885624338
STOOP
TAILORS&TEXTILES
SUITING,SHIRTING&READYMADES
MENS'S WEAR&KID'S WEAR
18-3-4,
BESIDE OLD POLICE STATION,
CHATRINAKA

సంపుటి: 3 సంచిక: 305, పేజీలు - 08
శుక్రవారం, ఫిబ్రవరి 16, 2024 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## ఇండియా కూటమికి మరో షాక్

### - గుడ్ బై చెప్పేసిన మరో కీలక పార్టీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సార్వత్రిక ఎన్నికల ముందు ఇండియా కూటమికి మరో షాక్ తగిలింది. ఇప్పటికే నితీశ్ కుమార్ జారిపోగా దీదీ కూటమిపై విమర్శన అస్త్రాలు ఎక్కుపెట్టింది. ఇప్పుడు తాజా కూటమి నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ బయటకు వెళ్లింది. రానున్న లోక్ సభ ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఆ పార్టీ చీఫ్ ఫారుక్ అబ్దుల్లా ప్రకటించారు. అంటే భవిష్యత్ లో తిరిగి ఎన్డీఏలో చేరనున్నట్లు సంకేతాలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ కు అత్యంత నమ్మకమైన భాగస్వామి చేయిజారిపోవడంతో ఇక

6లో

## కాంగ్రెస్ కార్నర్ చేస్తున్న అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్

### - బీఆర్ఎస్ చీఫ్ వ్యూహమేంటి.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే కాంగ్రెస్‌ను ధీటుగా ఎదుర్కొన్నామని వచ్చే సమావేశాల నుంచి టైగర్ వస్తుందని కాంగ్రెస్ పరిస్థితి తేలిపోతుందని కేటీఆర్ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షల సందర్భంగా దాదాపుగా ప్రతీ రోజూ ప్రకటనలు చేశారు. ఈ ప్రకటనలను చూసిన వారంతా కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావడం ఖాయమనుకున్నారు. కానీ కేసీఆర్ రావడం లేదు. ఒక రోజు వచ్చేస్తున్నారని మీడియాకు సమాచారం ఇచ్చారు. కానీ రాలేదు. మధ్యలో నల్లగొండ సభకు హాజరు కావడంతో అనారోగ్యం కారణాన్నీ చెప్పే పరిస్థితి లేదు. ఓ వైపు కాంగ్రెస్ పార్టీ పదే పదే కార్నర్ చేస్తోంది. ఎవరు మాట్లాడినా విలువ లేదని ప్రతిపక్ష నేత రావాల్సిందేనని డిమాండ్ చేస్తోంది. అసెంబ్లీకి రాని వ్యక్తికి ప్రజలు ఎందుకు ఓట్లేస్తారని రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. ఇంత తీవ్రమైన దాడిని ఎదుర్కొంటున్నా కేసీఆర్ మాత్రం సభకు హాజరు కావడం లేదు.

#### రేవంత్ సభానాయకునిగా ఉన్న అసెంబ్లీకి ప్రతిపక్ష నేతగా కేసీఆర్ హాజరు కారని మొదట్లో ప్రచారం

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. అధికారానికి దూరమైంది. ఆ తర్వాత కేసీఆర్ నగర సమీపంలోని ఎర్రవెల్లిలోని తన ఫార్మ్ హౌస్ లో బాత్రూమ్ కి వెళుతూ జారిపడ్డారు. హైదరాబాద్ సోమాజీగూడ ఆస్పత్రిలో తుంటికి ఆపరేషన్ చేయించుకున్నారు. హైదరాబాద్ నందీనగర్ లోని తన ఇంట్లో ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకుని మళ్లీ ఫార్మ్ హౌస్ చేరుకున్నారు. పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. నల్లగొండ సభకు హాజరయ్యారు. అయినా ఆయన మాత్రం అసెంబ్లీకి హాజరు కావడం లేదు. కేసీఆర్ సభకు హాజరు కాని అంశాన్ని కాంగ్రెస్ అడ్వాంటేజ్ గా తీసుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత ఇప్పటికి రెండుసార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. తొలి సమావేశానికి గానీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం

6లో

## వాలంటీర్లు చొక్కా మడత పెట్టే సమయం వచ్చింది

### - వాలంటీర్ల సభలో జగన్ వ్యాఖ్యలు





**గుంటూరు (ప్రశ్న న్యూస్)** వాలంటీర్లు నా సైన్యం పేదలకు సేవ చేసే వాలంటీర్లే రేపు కాబోయే లీడర్లు అని సీఎం జగన్ ప్రకటించారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో వాలంటీర్లకు వందనం బహిరంగసభను నిర్వహించారు. ఈ బహిరంగసభలో కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు జన్మభూమి కమిటీలు గంజాయి మొక్క. మన సచివాలయ వ్యవస్థ తులసి మొక్క అని ప్రకటించారు. గతంలో జన్మభూమి కమిటీల అరాచకాల వల్ల జనం నష్టపోయారు. చంద్రబాబు పాలన విషవృక్షం, మన పాలన కల్పవృక్షం. నా పాలనకు మీరంతా బ్రాండ్ అంబాసిడర్లు వాలంటీర్ల సేవలకు గర్విస్తూ సెల్యూట్ చేస్తున్నానన్నారు.

#### వారం పాటు వాలంటీర్లకు వందనం కార్యక్రమం

వారం పాటు వాలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని సీఎం జగన్ ప్రకటించారు. పేదవాళ్లకు మంచి చేయాలన్న

6లో

## మీరు చొక్కాలు మడత పెడితే మేం కుర్చీలు మడత పెడతాం

- సీనియర్ జర్నలిస్ట్ ఆలపాటి సురేష్ కుమార్ రచించిన 'విధ్వంసం' పుస్తకావిష్కరణ
- వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన పలు ఘటనలను ఎత్తిచూపుతూ పుస్తకం రచన
- ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న టీడీపీ, జనసేన అధినేతలు



**విజయవాడ (ప్రశ్న న్యూస్)** ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అరాచక పాలన చేశారంటూ, ఆయన పాలనపై రాసిన 'విధ్వంసం' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరు ఇద్దరూ ఒకేవేదికపై కనిపించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ప్రముఖ పత్రికా సంపాదకులు ఆర్వీ రామారావ్ వ్యవహరించారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో

6లో

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వివాదంపై తీర్పు రిజర్వ్

### - కాంగ్రెస్‌కు టెన్షన్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎన్నిక వివాదంపై హైకోర్టులో ఇవాళ మరోసారి విచారణ జరిగింది. పిటిషన్‌పై గురువారం ఉదయం నుంచి కోర్టులో సుదీర్ఘంగా ఇరుపక్షాల వారు తమ వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ తీర్పు వచ్చే వరకూ కోదండరాం, అమీర్ అలీ ఖాన్ ఎమ్మెల్సీ ఎన్నికపై స్టేటస్ కో కొనసాగనుంది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్‌ఖాన్‌లను నియమించడాన్ని

6లో

## ఎలక్టోరల్ బాండ్ల విక్రయాలు ఆపేయండి

### - సుప్రీంకోర్టు సంచలన తీర్పు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఎలక్టోరల్ బాండ్ల చెల్లుబాటుపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ బాండ్లు రాజ్యాంగ విరుద్ధం అని తేల్చి చెప్పింది. ఆర్టికల్ 19(1)(ఏ)తో పాటు సమాచార హక్కు చట్టానికి ఇవి విఘాతం కల్గిస్తున్నాయని స్పష్టం చేసింది. ఐదుగురు సభ్యులతో కూడిన

6లో

## అసెంబ్లీలో కొత్త రూల్స్

### - వాటికీ నో పర్మిషన్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ సంచలన మార్పులు తీసుకొస్తోంది. అటు పాలనాపరంగా, ఇటు పథకాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్న రేవంత్ సర్కార్ ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలు,

6లో

## బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ఖర్మ మాకేంటి

### - మెడమీద తలకాయ ఉన్నోడు ఆ పని చేయరు



**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** మెడమీద తలకాయ ఉన్నోడెవ్వరూ బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకోరని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ మునిగిపోయే నావ అని, ఆ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదని చెప్పారు. దేశవ్యాప్తంగా 400 సీట్లు బీజేపీకి రాబోతున్నాయని, ఒక్కసీటు రాని బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకోవాల్సన ఖర్మ మాకెందుకని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారని తెలుసుకున్న కేసీఆర్ పొత్తు పేరుతో డ్రామాలాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ బహిరంగ మిత్రులేనని, గతంలోనూ రెండు పార్టీలు పొత్తు పెట్టుకున్నాయన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లోనూ బీజేపీ

6లో

## హరీష్‌కు అదొక్కటే దారి

- ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి
- హరీష్ రావు మరో ఔరంగజేబు అన్న రేవంత్
- 70 రోజుల్లో 25 వేల ఉద్యోగాలిచ్చాం





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉద్యోగ నియామకాల విషయంలో పదేళ్లు బీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్యం వహించిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. వాళ్ల ఉద్యోగాలు ఊడగొట్టగానే మీకు ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. ఎల్బీ స్టేడియంలో గురుకుల ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. తమ ప్రభుత్వం 30 లక్షల మంది నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం నియామకాలు చేపడుతుందని అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీలో నియామకాలు చేపట్టాలని నిర్ణయించామని చెప్పారు. ఇందులో భాగంగా త్వరలోనే గ్రూప్ 1 పరీక్షను నిర్వహించబోతున్నామని చెప్పారు. "మా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుంటే మామా అల్లుళ్లు మమ్మల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారు. నువ్వు రాజీనామా చెయ్ నేను చేసి చూపిస్తా అని హరీష్ అంటుండు. హరీష్ రావును చూస్తుంటే మరో ఔరంగజేబులా కనిపిస్తున్నారు. అధికారం కోసం సొంత వాళ్లపైనే కర్కశంగా ప్రవర్తించిన చరిత్ర ఔరంగజేబుది. పదేళ్లు మంత్రిగా ఉండి హరీష్ ఏం చేశారు? మేడిగడ్డపై చర్చకు అసెంబ్లీకి రమ్మంటే రాకుండా పారిపోయిండ్రు. దశ బాగుంటే దిశతో పని లేదు. ప్రజలకు ఏం ద్రోహం చేశారో ఇప్పటికైనా కేసీఆర్ తెలుసుకోవాలి అని రేవంత్ రెడ్డి అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చిస్తున్న సమయంలో కుంగిన మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు నింపి చూపించాలని హరీష్ రావుకు సీఎం రేవంత్ రెడ్డి సవాలు చేసిన విషయం తెలిసిందే. ఆ సవాలుపై స్పందిస్తూ రేవంత్ రెడ్డికి చేతగాకపోతే సీఎంగా రాజీనామా చేయాలని, తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, పునరుద్ధరణ చేసే నీళ్లు నింపి చూపిస్తానంటూ హరీష్ రావు

6లో

## కాళేశ్వరంపై కాగ్ సంచలనం

### - రిపోర్టులో కీలక విషయాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను కాగ్ తప్పుబట్టింది. పీసీఎస్ఎస్ ప్రాజెక్టు అంచనా వ్యయం 38 వేల 500 కోట్లు. అయితే రీ-ఇంజనీరింగ్ సమయంలో కాళేశ్వరం, ప్రాణహిత ప్రాజెక్టులు రెండింటికీ కలిపి 85 వేల 651.81 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. రీ-ఇంజనీరింగ్ కారణంగా ఉమ్మడి ప్రాజెక్టు వ్యయం 122 శాతం మేర పెరిగిందని కాగ్ తెలిపింది. లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు 52.22 శాతం మేర మాత్రమే పెరిగిందని వెల్లడించింది.

#### రీ డిజైన్ తర్వాత కూడా మళ్లీ మళ్లీ మార్పులు

రీ-ఇంజనీరింగ్ తర్వాత కూడా కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పరిధిలో మరిన్ని మార్పులు, చేర్పులు చేశారని కాగ్ తెలిపింది. ఫలితంగా కాళేశ్వరం ప్రాజెక్టు విలువ ఇప్పుడు లక్షా 47 వేల 427.41 కోట్లకు చేరిందని కాగ్ తన నివేదికలో వెల్లడించింది. అయితే లక్ష్యంగా పెట్టుకున్న ప్రయోజనాల్లో మాత్రం తదుపరి పెరుగుదల ఏమీ లేదని వివరించింది. ఆ విధంగా రెండు

6లో

## సంపాదకీయం

# బతకడం నేర్పించే విద్య కావాలి

మనదేశంలో విద్యా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఎంత డబ్బు పెడితే అంత చదువు కొనుక్కోవచ్చనే ఆలోచనలో తల్లిదండ్రులు ఉన్నారు. పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు సైతం తమ పిల్లల చదువుల కోసం ఆస్తులు తెగనమ్మి కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. వ్యాపారాత్మకమైన విద్యలో విలువలకు చోటు లేకుండా పోయింది. మార్కులు, ర్యాంకులకే ప్రాధాన్యత ఉంది. కానీ అమెరికా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానం చాలా బాగుంటుంది. పూర్తిగా ఉచితం కావడం, విద్యా ప్రమాణాలు బాగుండటంతో ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. అమెరికాలో పారిశ్రామిక విప్లవం అనంతరం అనేక రంగాల్లో బాగా మార్పులు వచ్చాయి. ముఖ్యంగా విద్యారంగంలో ఆ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మార్పులే ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికా ఎదగడానికి దోహదపడ్డాయి.అమెరికా మొత్తం బడ్జెట్‌లో విద్యకు సుమారు 8.5 శాతం అంటే 90 బిలియన్ డాలర్లకు పైగా వెచ్చిస్తున్నారు. అమెరికాలో కిండర్ గార్డెన్ నుంచి 5వ తరగతి వరకు ఎలిమెంటరీ స్కూల్ పేరుతో పిలుస్తారు. 6, 7, 8 తరగతులను మిడిల్ స్కూల్ అని.. 9, 10, 11, 12 తరగతులను హైస్కూల్ అని అంటారు. హైస్కూల్ చదువు వరకు ప్రభుత్వం ఉచిత విద్యను అందజేస్తుంది. తర్వాత కాలేజీ విద్య కొనసాగింపు చాలా ఖరీదైన వ్యవహారం బాగా మార్కులు తెచ్చుకోగలిగితే స్కాలర్ షిప్‌ల రూపంలో ఆర్థిక వనరులు సమకూరుస్తారు. మిషనరీ స్కూల్స్ కూడా ఉంటాయి, అలాగే రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలో కమ్యూనిటీ కాలేజీలు ఉన్నాయి. ఇక్కడ మాత్రం నామమాత్రపు ఫీజులుంటాయి. ఒక్కో క్లాస్‌కు 25 నుంచి 30 మంది వరకు విద్యార్థులు ఉంటారు. అమెరికాలో బాలబాలికలిద్దరూ కలిసే చదువుకుంటారు. అందరూ కలిసి భోజనం చేసేందుకు పెద్ద డైనింగ్ హాల్ ఉంటుంది. ఇక్కడ పేద పిల్లలకు ఉచితంగా ఆహారం అందజేస్తారు. మిగిలిన వారు నగదు చెల్లించాల్సి ఉంటుంది. మంచి ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందజేస్తారు. అన్ని ప్రాంతాలకు ఉచిత బస్సు సౌకర్యం ఉంటుంది. తల్లిదండ్రులు, టీచర్లు, పిల్లలను అనుసంధానం చేస్తూ ఒక యాప్ ఉంటుంది. అందులో విద్యార్థి హాజరు, మార్కులు, ప్రవర్తనా తీరులాంటి అనేక అంశాలు పొందుపరుస్తారు.ఒక జాతిని సామాజికంగా, ఆర్థికంగా నడిపించే శక్తి విజ్ఞానానికి, నైపుణ్యానికి మాత్రమే ఉందన్న వాస్తవాన్ని గ్రహించిన అమెరికా ఆ దిశగా పయనించింది. అమెరికాలోని డేకేర్స్, ప్రైవేటు పాఠశాలల్లో భారీ ఫీజులుంటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం చాలా అందమైన, ఆహ్లాదకరమైన వాతావరణం, అత్యంత సౌకర్యవంతంగా ఉంటాయి. ఆయా స్కూల్స్ లో ఉన్న విద్యాప్రమాణాలు, విద్యా బోధన, ఇతర సౌకర్యాలు ఆధారంగా వాటికి ఒకటి నుంచి పది పాయింట్ల వరకు రేటింగ్ ఇస్తారు. ఏ ప్రాంతంలో నివసిస్తున్న వారు ఆ ప్రాంతంలో ఉన్న పాఠశాలల్లోనే చేర్పించాలి. ఇక్కడ విలువలతో కూడిన విద్య, నైపుణ్యం సంపాదించి బతకడం నేర్పిస్తారు. పిల్లలు కూడా ఇష్టంగా స్కూళ్లకు వెళతారు. కానీ మన పాఠశాలల్లో పిల్లలను వాస్తవ ప్రపంచానికి దూరంగా పెంచుతున్నాం. పుస్తక ప్రపంచంలో ఉంచి బట్టీ చదువులకు అలవాటు చేస్తున్నాం. బడికి ఎప్పుడైనా వెళ్లి చదువుకోవచ్చు, కానీ మంచి పౌరుడిగా ఎదగడానికి పసి వయసులోనే బీజం పడాలి. కానీ ఆ కోణంలో ఆలోచించలేక పోతున్నాం. బడ్జెట్ లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం బడ్జెట్ లో 2.5 శాతం.. అంటే లక్షా 12 వేల కోట్లు కేటాయించారు. ఆ నిధుల్లో కూడా ఎక్కువ భాగం సద్వినియోగం కావడం లేదు. మార్కులే కొలమానంగా భావిస్తూ, వాటి సాధనే జీవిత లక్ష్యంగా బోధిస్తున్నారు.అంతిమంగా పరీక్షల్లో సంపాదించే మార్కులనే మనం విద్యకు ప్రామాణికంగా తీసుకోవడంతో పిల్లలపై మానసిక ఒత్తిడి పెరుగుతోంది. దీంతో పొరపాటున పరీక్షల్లో తప్పితే జీవితమంతా వ్యర్థమైనట్లు, ఓడిపోయినట్లుగా భావిస్తున్నారు. వీటివల్ల వారిలో ఆత్మనూన్యతాభావం పెరిగి మానసిక క్షోభతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. భారతీయుల్లో సహజంగా ఉండే కష్టపడే గుణం, నేర్చుకునే తపన, పోటీతత్వం తదితర కారణాలతో వారు బాగా రాణిస్తూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. కరోనా సమయంలో ఆన్ లైన్ విద్యావిధానానికి గిరాకీ పెరిగింది. మనదేశంలో ఉన్న విద్యావంతులు దీనిని అవకాశంగా మలచుకుని అనేక దేశాల్లో విద్యార్థులకు బోధిస్తున్నారు. అమెరికాలో పౌరసత్వం ఉన్న భారతీయులు సైతం ఇక్కడి స్కూళ్లలోని విశృంఖలత్వం, నేరప్రవృత్తి, కట్టుబాట్లు లేని సాంప్రదాయాలతో తమ పిల్లలు ఎక్కడ చెడిపోతారోనని భయపడుతున్నారు. దీంతో మాతృదేశంలోని స్కూళ్లలో చేర్పించేందుకు మొగ్గుచూపుతున్నారు. ఇటీవల కాలంలో అది పెరిగిపోయింది.లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ఎక్కువ మార్కులు, ర్యాంకులు సాధించడం కంటే నైతిక విలువలు, సృజనాత్మకతతో కూడిన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలు వర్తమానంలో జీవించడానికి అలవాటు చేయాలి. వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో ఆయా రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలి. పిల్లల ఆసక్తిని గమనించకుండా తల్లిదండ్రుల ఇష్టాఇష్టాలను వారిపై రుద్దే ప్రయత్నం చేయకూడదు. పిల్లలను ఇతరులతో పోల్చడం, వారిని పదేపదే విమర్శించడం వల్ల వారిలో ఆత్మనూన్యతా భావం పెరిగి.. తోటి విద్యార్థుల పట్ల ద్వేషం పెరుగుతుంది. విద్యాబోధన అంటే కేవలం సంపాదన అనే దృక్పథంతో చూడకూడదు. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా ఉండాలి. ఆత్మవిశ్వాసాన్ని, జ్ఞాపకశక్తిని, సామాజిక స్పృహను పెంచడం ద్వారా వారిలో చదువుల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

# సమస్త ప్రాణకోటికి జీవనాధారం సూర్య భగవానుడు

**(రథసప్తమి సందర్భంగా ప్రత్యేకం)**

ప్రతి ఏటా మాఘ మాసంలో శుక్ల పక్షం సప్తమి తిథి రోజున రథసప్తమి పండుగను జరుపుకుంటారు. రథసప్తమికి ఎంతో ప్రత్యేక విశిష్టత ఉంది. భూమిపై జీవరాశులు సుభిక్షంగా మనగలుగుతున్నాయంటే అందుకు కారణం సూర్యుడే భగవానుడే. ఈ కారణంగానే భానుడిని కనిపించే దేవుడు అని అంటారు. హిందూ సంప్రదాయం ప్రకారం సూర్యాధనకు ఎంతో విశిష్టత ఉంది. ముఖ్యంగా భక్తులు సూర్య జయంతి రోజు ఎక్కువగా పూజిస్తారు. మాఘ మాస శుక్ల పక్షం సప్తమి తిథి నాడు ఈ పర్వదినం వస్తుంది. దీన్నే రథ సప్తమి అని కూడా అంటారు. సూర్యుడు ఏడు గుర్రాల రథంపై దక్షిణాయనం ముగించి పూర్వోత్తర దిశగా ప్రయాణం సాగిస్తుండని భక్తులు విశ్వసిస్తారు. అది ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. మాఘ సప్తమి నుంచి రానున్న ఆరు మాసాలు ఉత్తరాయణ పుణ్యకాలంగా పరిగణిస్తారు.

### ఏడు గుర్రాల ప్రత్యేకత

సూర్యుడు ఏడు గుర్రాలు ఏడు వారాలకు సంకేతాలు. ఈ ఏడు గుర్రాలను వేదఛందస్సులు అని అంటారు. గాయత్రి, త్రిష్టుప్, జగతి అనుష్టుప్, పంక్తి, బృహతి, ఉష్ణిక్ అనే ఏడు గుర్రాల రథంపై భానుడు స్వారీ చేస్తాడు. మేషం నుంచి మీనం వరకు ఉన్న పన్నెండు రాశుల్లో ప్రయాణిస్తారు. ఈ 12 రాశులను పూర్తి చేయడానికి సూర్యరథానికి ఏడాది సమయం పడుతుంది. సూర్య జయంతి అంటే సూర్యుడి పుట్టినరోజు కాదు. రథాన్నెక్కి సూర్యుడు సాగించే ప్రయాణం ఈ రోజు నుంచి మొదలవుతుంది

### ద్వాదశ రాశులలో సంచారం

విశ్వం ఒక వృత్తంలా భావిస్తే దానికి 360 డిగ్రీలు ఉంటాయని గణితశాస్త్రం చెబుతోంది. సూర్యుడు రోజుకు ఒక డిగ్రీ చొప్పున సంచరిస్తు 360 రోజులలో ఈ వృత్తాన్ని పూర్తిచేస్తాడు. అంటే ఒక సంవత్సరం. అందుకే జ్యోతిష్కులు ఈ సృష్టి చక్రాన్ని 12 రాశులుగా విభజించి, ఒక్కొక్క రాశిని 30 డిగ్రీలుగా విభజించారు. సూర్యుడు ఒక్కొక్క రాశిలో సంచరించే కాలాన్ని ఒక మాసంగా పరిగణించారు. మనకు కనిపించే సూర్యుడు ఒక్కడే అయినా, విశ్వంలో ఇంకా 11 మంది సూర్యులు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. కానీ మన భారతీయులు వేదకాలంలోనే ఈ ద్వాదశ ఆదిత్యులను కనుగొన్నారు. వారే మిత్ర, రవి, సూర్య, భగ, పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవిత, అర్క, భాస్కరులు. వీరే ద్వాదశ మాసాలకు ఆధిదేవతలు. వీటి కారణంగానే 12 రాశులు ఏర్పడ్డాయి. సూర్యుడు ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క రాశిలో సంచరిస్తాడు.

### ఉత్తర దిశలో ప్రయాణం

మాఘమాసంలో "అర్క" నామంతో సంచరిస్తాడు. మాఘ అంటే పాపం లేనిది అని అర్థం. పుణ్యాన్ని ప్రసాదించే మాసం కాబట్టి ఈ మాసాన్ని మాఘమాసం అన్నారు. నిజానికి ఉత్తరాయణం మకర సంక్రాంతితో ఆరంభమైనా, రథసప్తమి నుంచే ఉత్తరాయణస్ఫూర్తి పూర్తిగా గోచరిస్తుంది. దక్షిణాయణం నుంచి విముక్తుడైన భాస్కరుడు ఈ రోజు నుంచే ఉత్తర దిక్కుగా ప్రకాశిస్తాడు. కాబట్టి రథసప్తమిని సూర్య గ్రహణతుల్యంగా భావించి, పితృ, దేవరుషి తర్పణాలను ఇవ్వాలనే నియమాన్ని నిర్ణయించారు.

### శత్రు బాధలు తొలగిపోవడానికి

సౌర కుటుంబంలో అన్ని ప్రాణులకు సూర్యుడే ఆత్మ. కాబట్టి సూర్యోపాసన చేస్తే రుణ, రోగ, శత్రుబాధలు నశిస్తాయి. మన మంత్ర పుష్పాలలో ఒకటిగా పేర్కొనే 'యోపం పుష్పం వేదా, పుష్పవాన్ ప్రజావాన్, పశుమాన్ భవతి' అనే వాక్యాలు దీనికి సంబంధించినవే. సూర్యారాధన చేసేవాడు పుష్పవంతుడు, సంతానవంతుడు, పశుసంపద సమృద్ధివంతుడు అవుతాడు. సూర్యకాంతిలోని కిరణాల ప్రభావం వల్లే శరీరానికి సహజసిద్ధంగా విటమిన్ 'డి' లభిస్తుంది.

సూర్యకిరణాలు శరీరంపై తప్పక ప్రసరించాలి. అందుకే వైదిక వాఙ్మయం సంధ్యావందనం, సూర్యనమస్కారాలు, అర్ఘ్యప్రధానం మొదలైన ప్రక్రియల్ని ప్రవేశపెట్టింది



రవికుమార్ సంతోజు
బడంగ్ పేట్

# అటు భద్రాద్రి.. ఇటు పాపికొండలు

- పర్యాటక సందడి షురూ - శైవక్షేత్రాల సందర్శనకు చలో
- సిటీ టూర్.. అనంతగిరి పర్యటన
- తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక ప్యాకేజీలు





పర్యాటక సందడి తిరిగి మొదలైంది. కోవిడ్ కారణంగా చాలా కాలంగా ఇళ్లకే పరిమితమైన నగరవాసులు కాలక్షేపం కోసం పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ పర్యాటకుల అభిరుచికి అనుగుణమైన ప్యాకేజీలను రూపొందించింది. నగరంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో హైదరాబాద్‌ను సందర్శించే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది.

**ప్రకృతి ఒడిలో..** పాపికొండల యాత్ర: ఇది ప్రతి శుక్రవారం ఉంటుంది. రాత్రి 8.30 గంటలకు బయలుదేరుతారు. శనివారం ఉదయం భద్రాద్రికి చేరుకుంటారు. శ్రీరాముడి దర్శనం అనంతరం పర్ణశాలకు వెళ్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం పాపికొండలకు వెళ్తారు. రాత్రికి కొల్లూరులోని బ్యాంబూ హట్స్‌లో బస ఉంటుంది. మరుసటి రోజు బయలుదేరి తిరిగి నగరానికి చేరుకుంటారు. పెద్దవారికి చార్జీ రూ.4,594 ఉంటుంది. పిల్లలకు ఇందులో 80 శాతం వరకు చార్జీ ఉంటుంది.

**ఆధ్యాత్మికం.. రమణీయం..** అనంతగిరిహిల్స్: వికారాబాద్ సమీపంలోని అద్భుతమైన పర్యాటక ప్రాంతం అనంతగిరి విహారం కోసం నగరం నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి రాత్రి 8 గంటలకు తిరిగి చేరుకుంటారు. అనంతగిరి కొండల్లో రమణీయమైన ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు, పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించవచ్చు. ఈ టూర్ కోసం పెద్దవారికి రూ.900, పిల్లలకు రూ.720 చొప్పున చార్జీ ఉంటుంది.

**సిటీ టూరు.. బోటు షికారు..** సిటీ టూర్‌లో భాగంగా బిర్లా టెంపుల్, నిజామ్ మ్యూజియం, చౌమొహల్లా ప్యాలెస్, చార్మినార్ (బయట నుంచి మాత్రమే), జూపార్కు, తారామతి బారాదరి, గోల్కొండ తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.ఈ పర్యటన కోసం ఏసీ వాహనాల్లో రూ.350, నాన్ ఏసీ వాహనాల్లో రూ.250 వరకు చార్జీ ఉంటుంది. పర్యటనలో భాగంగా టిఫిన్, భోజనం, వివిధ ప్రాంతాల్లో సందర్శన టికెట్ల రుసుము పర్యాటకులే చెల్లించాల్సి ఉంటుంది. రవాణా సదుపాయాన్ని మాత్రమే పర్యాటక అభివృద్ధి సంస్థ కల్పిస్తుంది. హుస్సేన్‌సాగర్‌లో బోటు షికారు కూడా అందుబాటులోకి తెచ్చారు.కాకతీయ రీజియన్ యాత్ర: ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి బస్సు బయలుదేరుతుంది. 2వ రోజు రాత్రి 9 గంటలకు తిరిగి చేరుకుంటారు. కాళేశ్వరం, రామప్ప, వేయిస్తంభాల గుడి, యాదాద్రి, కీసర తదితర పుణ్యక్షేత్రాల సందర్శన ఉంటుంది. పెద్దవారికి రూ.1,550, పిల్లలకు రూ.1,320 చొప్పున చార్జీ ఉంటుంది.



**శైవ క్షేత్రాల సందర్శన..**

శాతవాహన యాత్ర: ఈ పర్యటన కోసం నగరం నుంచి ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు బయలుదేరి తిరిగి రాత్రి 10 గంటలకు చేరుకుంటారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి తదితర ఆలయాల సందర్శన ఉంటుంది. బస్సు చార్జీ పెద్దవారికి రూ.1300, పిల్లలకు రూ.1040 చొప్పున ఉంటుంది. ఆలయ ప్రవేశ రుసుము, భోజనం వంటివి పర్యాటకులే ఏర్పాటు చేసుకోవాలి. పంచారామాలకు: ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామాలకు కూడా హైదరాబాద్ నుంచి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఇది 3 రోజుల పాటు ఉంటుంది. ఉదయం 9 గంటలకు బయల్దేరి 3వ రోజు ఉదయం 7 గంటలకు తిరిగి నగరానికి చేరుకుంటారు. అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను సందర్శించవచ్చు. పెద్దవారికి రూ.3,500, పిల్లలకు రూ.2,800 చొప్పున చార్జీలు ఉంటాయి.





**బుకింగ్ ఇలా..** ఈ పర్యటనల కోసం తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.ఆన్‌లైన్‌లోనే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 040%--29801040, 98485 40371

విశ్లేషణలు రచయిత వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే వాటితో పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు: ఎడిటర్

# బిజెపి కార్యకర్తల సమావేశంలో ఎంపీ సిఎం మోహన్ యాదవ్





**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం బిజెపి బూతు అధ్యక్షులు,ఆ పైస్థాయి నాయకుల సమావేశం కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ఇంపీరియల్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్.ఆయన మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అని, ఎన్నో భాషలకు నిలయం మనదేశం.ప్రధానంగా ఎప్పటికీ మన శత్రువు పాకిస్థాన్.మరో విషయం ఏమిటంటే తాను ఛత్రపతి శివాజీ, రాణా ప్రతాప్ సింగ్, ఆజాద్ చంద్రశేఖర్, సుభాష్ చంద్రబోస్ వీరొవరిని చూడలేదు కానీ మనదేశంలో ప్రస్తుతం అలాంటి వీరులు వలే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని చూడడమే కాకుండా ఆయన పరిపాలన ప్రపంచమే గర్వించదగ్గ అద్భుతంగా పాలిస్తున్నారని అందుకే మోడీ జీ ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి అవుతారు. అందుకు మనం దేశం కోసం పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని డివిజన్ బిజెపి నేతలు కార్యకర్తలను కోరారు. గత ప్రభుత్వాలు దేశాన్ని అభివృద్ధి చేయక సొంత లాభాలు కోసం పాటుపడ్డారని విమర్శించారు.అలాగే బిజెపి ప్రభుత్వం గత ప్రభుత్వాల తప్పిదాలను సరిచేస్తూ, కాశ్మీర్ ఆర్టికల్ 370 నా రద్దు చేసిన విషయం గుర్తు చేశారు.జనవరి 22 అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట చేసిన ఘనత కేవలం బిజెపి దేనని సిఎం మోహన్ యాదవ్ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ సిద్ధంతాలపై నడిచే పార్టీ.సనాతన ధర్మాన్ని భావితరాలకు వారసత్వంగా ఇచ్చే బాధ్యత భాజపా దే.బూతు స్థాయి నుంచి బిజెపి ను మరింత పటిష్టంగా చేయాలి.భాజపా విజయానికి అందరూ కృషి చేయాలని సిఎం మోహన్ పిలుపునిచ్చారు.దేశాన్ని పాలించే సమర్థవంతమైన నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ.కాంగ్రేస్ మతకల్లోలను సృష్టించింది. అదిగాక హిందూ ముస్లింల మధ్య గొడవలను కాంగ్రెస్ పార్టీ చిచ్చు రేపిన విషయాలను సిఎం మోహన్ గుర్తు చేశారు. అలాగే భాజపా రాజనీతి కుర్చీ కోసం కాదు,దేశ ప్రజల బాగోగులు కోసం అహర్నిశలు శ్రమించే పార్టీ అన్నారు.చాయ్ అమ్మే వ్యక్తిని ప్రధాని చేసిన ఘనత, అలాగే సాధారణ వ్యక్తిని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన పార్టీ బిజెపి.భారతీయ జనతా పార్టీ కుటుంబ రాజకీయాలను ప్రోతసహించదు.అయోధ్యలో రామ మందిరం, అరబ్ దేశాల్లో హిందూ దేవాలయాలు వైభవం మోడీ వల్లే సాధ్యం.ట్రిపుల్ తలాక్ రద్దు చేసి ముస్లిం మహిళలకు న్యాయం చేసింది ఎన్డీయే ప్రభుత్వం.వికసిత భారత్ అనే నినాదంతో ఈసారి మోడీ ని ప్రపంచంలోనే గొప్ప దేశంగా భారత్ ను నిర్మించనున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కామెంట్స్: సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సంఖ్యలో గెలిచి కేంద్రంలో మరోసారి నరేంద్ర మోడీ నాయకత్వంలో భాజపా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.సాధారణకార్యకర్త నుండి ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టి సమర్థవంతంగా పాలిస్తున్న గొప్ప నాయకుడు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్.అలాగే ఫిబ్రవరి చివరి వారంలో షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఎన్నికలకు భాజపా కార్యకర్తలు , నాయకులు సిద్ధం కావాలి. ప్రపంచ దేశాల్లో భారత గౌరవాన్ని పెంపొందించడం,దేశ ఔన్నత్యాన్ని గొప్ప స్థాయికి తీసుకువెళ్లిన వ్యక్తిగా, అభివృద్ధి సంక్షేమాన్ని చేస్తూ దేశాన్ని ప్రపంచ పటంలో గొప్పగా నిలిపిన వ్యక్తి పిఎం నరేంద్ర మోడీ.అవనీతి కుంభకోణాల నుండి నీతివంతమైన దేశంగా తయారు చేశారు.దేశంలో ఉగ్రవాదాన్ని, మతకల్లోలను నిర్మూలించిన గొప్ప నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ.ఇతర దేశాల పై ఆధారపడకుండా స్వతహాగా మేకింగ్ ఇండియా పేరుతో ఎన్నో రంగాలను స్థాపించిన, అలాగే విమానాశ్రయాలు,రైల్వే, జాతీయ రహదారులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ, సైనిక వ్యవస్థను మరింత పటిష్టం చేశాం.తెలంగాణలో నూతనంగా నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్ కి ఎనిమిది వందల కోట్ల రూపాయలు మంజూరు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డు కోసం సుమారు ఇరవై ఐదు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి, లక్ష్మన్ ఓబీసీ మోర్చ జాతీయ అద్యక్షుడు, మురళీధర్ రావు మధ్యప్రదేశ్ బిజెపి వ్యవహారాల ఇన్చార్జ్, ఈటెల రాజేందర్ మాజీ ఎమ్మెల్యే, భాజపా సీనియర్ నాయకుడు, మర్రి శశిధర్ రెడ్డి మాజీ సనత్నగర్ శాసనసభ్యుడు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సివిల్ మెంబర్ రామకృష్ణ, మోండా డివిజన్ కార్పొరేటర్ కొతం దీపికా,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భానుక మల్లికార్జున్ ,బి.ఎన్.శ్రీనివాస్, అజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా ఓట్ల అవకతవకలకు పాల్పడుతున్న వైసీపీ నేతలు

**- "నిజం గెలవాలి" యాత్రలో నారా భువనేశ్వరి**



**శ్రీ సత్యసాయి జిల్లా :** వైసీపీ నేతలు భారీగా ఓట్ల అవకతవకలకు పాల్పడుతున్నారని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. గురువారం నాడు "నిజం గెలవాలి" యాత్ర సత్యసాయి జిల్లాలోని మడకశిర నియోజకవర్గంలో కొనసాగుతోంది. ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మడకశిర సెంటర్‌లో సంఘీభావం తెలిపేందుకు వచ్చిన కార్యకర్తలతో ముచ్చటించారు. మడకశిర నియోజకవర్గం, గుడిబండ మండలం, దిన్నెహట్టి గ్రామంలో పార్టీ కార్యకర్త జి. ముత్తప్ప కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. ముత్తప్ప కుటుంబసభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు.బాధిత కుటుంబ సభ్యులకు రూ.3లక్షలు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ...వైసీపీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓట్ల జాబితాలో అవకతవకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానుల ఓట్లను వైసీపీ నేతలు తొలగిస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల కురుక్షేత్రంలో ఓటే మన ఆయుధమని చెప్పారు. ఈ ఐదేళ్లలో ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని.. కనీసం మౌలిక వసతులు కూడా అందడం లేదని అన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలంటే రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఓటు అనే ఆయుధంతో ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని ఓడించాలని నారా భువనేశ్వరి అన్నారు.

## దోపిడీ చేయడం పూజలు చేయడం ఇది ద్వారంపూడికి అలవాటే



**కాకినాడ :** కాకినాడ నగరంలో ప్రజల సొమ్ముని బాండ్ల పేరుతో దోచుకోవడం తిరిగి పూజల పేరుతో క్రతువులు నిర్వహించడం కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి అలవాటేనని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు. గతంలో సురేష్ నగర్ పార్కులో బాండ్ల పేరుతో కొట్టివేసిన 160 కోట్లు, అలాగే సబ్ స్టేషన్ నిర్మాణం పేరుతో కొట్టి వేసిన 250 కోట్ల రూపాయల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు పూజల పేరుతో క్రతువులు నిర్వహిస్తున్నారని కొండబాబు అన్నారు. గురువారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో వనమాడి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులను నగర నగర అభివృద్ధికి తీసుకురాకుండా కార్పోరేషన్ సొమ్మును దోపిడీ చేస్తున్నారన్నారు. కాకినాడలో వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి టీటీడీ రెండు కోట్ల రూపాయలను కేటాయించిందని నాడు చెప్పగా నేడు మాత్రం తన సొంత నిధులు నాలుగు కోట్లతో నిర్మిస్తున్నానని చెప్పడం ఎంతవరకు నిజమన్నారు. వీటిలో ఏది నిజమో బహిర్గితపరచాలన్నారు. అలాగే 16వ తేదీ మధ్యాహ్నం స్వామి వారికి కళ్యాణం చేస్తున్నామని నగరంలో ఉన్న దుకాణాలు మూసివేయాలంటూ తన అనుచరులతో బెదిరింపు చర్యలకు పాల్పడటం తగదన్నారు. తమ హయాంలో దైవ కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రజలు భక్తితో వచ్చే వారిని ప్రస్తుతం ఎమ్మెల్యే చేస్తున్న అరాచకాలకు భయపడి భయంతో వస్తున్నారన్నారు. ద్వారంపూడి రాత్రి వేళలో క్రైస్తవ సభలకు వెళ్లి క్రైస్తవుడైన జగన్ను తిరిగి సీఎం చేయాలని వేడుకుంటున్నాడని పగటిపూట హిందూ పూజలు చేసి నగర ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ద్వారంపూడి నగర అభివృద్ధి చేయకపోగా కార్పొరేషన్ నిధులను దోచుకుంటున్నారంటూ వనమాడి చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, గుజ్జు లక్ష్మణరావు, ఎంఎ తాజుద్దీన్, బంగారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## శ్రీశైలంలో చిరుత సంచారం

**శ్రీశైలం** శ్రీశైలంలో చిరుత సంచరించడం కలకలం రేపింది.ఆలయ పరిధిలోని రెడ్లసత్రం కింది భాగాన చిరుతపులిని చూసి భక్తులు సెల్ఫోన్లో చిత్రీకరించారు. శ్రీశైలంలో పలుమార్లు చిరుతలు స్వైరవిహారం చేస్తున్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపించారు. అధికారులు ఫారెస్ట్ చుట్టూ రక్షణ గోడను నిర్మిస్తామని చెప్పి ఎటువంటి పనులు ప్రారంభించకపోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## జూపార్క్‌లో విషాదం..

## సింహం దాడిలో యువకుడు మృతి

తిరుపతిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నగరంలోని ఎస్వీ జూపార్క్‌లో ఒక యువకుడిపై సింహం క్రూరంగా దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సెల్ఫీ దిగడం కోసం నిబంధనలు ఉల్లంఘించి ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లడంతో సింహం దాడి చేసినట్లు సమాచారం.

కాగా, వెంటనే అప్రమత్తమైన సిబ్బంది అందరినీ బయటకు పంపించివేశారు. కొత్తగా వచ్చేవారికి సైతం అనుమతి నిరాకరించారు. కాగా, సెల్ఫీ దిగడానికి ముందు సింహం ముందు సదరు యువకుడు తొడ కొట్టినట్లు సమాచారం. సింహంతో పరాచికాలు ఆడి చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడని స్థానికులు అంటున్నారు. సింహం దాడి నుంచి తప్పించుకునేందుకు ఆ యువకుడు చెట్టు ఎక్కినా ఫలితం లేకుండా పోయిందని అక్కడ చూసిన వారు చెబుతున్నారు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు చేస్తున్నారు. దాడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## పోలీసు అధికారులకు డీజీపీ అభినందన

**విజయవాడ** విశాఖపట్నం లో జనవరి 18 నుండి 30 వరకు జరిగిన 14వ అఖిల భారత పోలీసు కమాండో పోటీల ను విజయవంతంగా నిర్వహించిన పోలీస్ అధికారులను డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి అభినందించారు. దేశంలో ఇప్పటి వరకు, వివిధ రాష్ట్రాలలో మొత్తం 13 అఖిల భారత పోలీసు కమాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా సామర్థ్యం, విశ్వాస స్థాయిలు, శారీరక మరియు మానసిక ప్రమాణాలు, జట్టు కృషి మొదలైవి పెంపొందించాడానికి ఉపయోగపడతాయి. ప్రతిష్ఠాత్మకమైన 14వ (అఖిల భారత పోలీసు కమాండో పోటీల)ంఎఖఅఅ?2023-24ను ఆంధ్ర ప్రదేశ్ పోలీసు శాఖ తరుపున జనవరి 18 నుంచి 30 వరకు విశాఖపట్నం లోని గ్రేహౌండ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం లో నిర్వహించారు.ఈ పోటీలలో వివిధ ట్రోఫీలు, బెస్ట్ స్టేట్ పోలీస్ కమాండో టీం, రణ-నీతి, చక్రవ్యూహ్-1 రూరల్ ఒ చక్రవ్యూహ్-2 అర్బన్, బ్లాక్ హాక్ ఫైరింగ్, చీతా రన్, బెస్ట్ టీం ఇన్ కాన్ఫిడెన్స్ కోర్సు, కమాండో కంపిటషన్ హార్డ్ లైనర్ (బ్రోంజ్), కమాండో కంపిటషన్ రన్నర్-అప్ (సిల్వర్), కమాండో కంపిటషన్ విన్నర్ (గోల్డ్) వంటి మొత్తం 10 ట్రోఫీల కోసం 300 మంది తో కూడిన వివిధ రాష్ట్రాలు, కేంద్ర దళాలకు చెందిన 23 జట్లు పోటీ పడి తమ అత్యున్నత నైపుణ్యాలను ప్రదర్శించాయి.

ఏపి గ్రేహౌండ్స్ జట్టు 10 ట్రోఫీలలో 05 ట్రోఫీలు, బెస్ట్ స్టేట్ పోలీస్ కమాండో టీం (జయలలిత, ఇలీ-అఓ నీట ఎఔ ట్రోఫీ ), చక్రవ్యూహం 1 రూరల్, బెస్ట్ బ్లాక్ హాక్ ఫైరింగ్, టీం ఇన్ కాన్ఫిడెన్స్ కోర్సు గెలుచుకుంది. , తద్వారా, గ్రేహౌండ్స్ జట్టు ఓవర్‌ఆల్ విజేత గా నిలవడం తో కొమండో పోటీలలో స్వర్ణం సాధించి మొదటి స్థానం లో నిలిచింది.

రన్-నీతి ట్రోఫీ బిఎస్ఎఫ్ కు, చక్రవ్యూహం 2 అర్బన్ మహారాష్ట్ర టీం, చీతా రన్ ఆర్పిఎఫ్ కానిస్టేబుల్ శ్రీ బిజేంద్ర, కమాండో కంపిటషన్ హార్డ్ లైనర్ (బ్రోంజ్)/మూడవ స్థానం రాజస్తాన్, కమాండో కంపిటషన్ రన్నర్-అప్ (సిల్వర్)/రెండవ స్థానం లో మహారాష్ట్ర విజేతలుగా నిలిచారు. అఖిల భారత పోలీసు కమాండో పోటీల్లో అగ్రస్థానం లో నిలిచిన ఆంధ్ర ప్రదేశ్ పోలీసు కమాండో టీంలను ఈ రోజు పోలీసు ప్రధాన కార్యాలయం లో డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి అభినందించారు .

## బైపాస్ రోడ్డు ఎస్సార్ బంక్ వద్ద ప్రమాదం

**ఏలూరు** దొరమామిడి నుంచి జంగారెడ్డిగూడెం వచ్చే ఏపీఎస్ ఆర్టీసీ బస్సును లారీ ఢీకొంది. స్థానికులు క్షతగాత్రుల ను ప్రభుత్వ ఏరియా హాస్పటలకు తరలించారు.

108 కి ఫోన్ చేసినా రాలేదని , స్థానికుల సాయంతో ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

## అందరికి న్యాయం చేయడమే ప్రథమ కర్తవ్యం

**- గంజాయి స్మగ్లర్లు పై ఉక్కు పాదం**

**- ప్రజలకు అందుబాటులో ఉంటా**

**- మెట్ పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు**

**కోరుట్ల,** తన పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్లో అందరికీ న్యాయం జరిగేలా చేయటమే తన ప్రథమ కర్తవ్యమని నూతన బాధ్యతలు చేపట్టిన మెట్ పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు అన్నారు..మెట్ పల్లి లో విధులు నిర్వర్తిస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.ఈ మేరకు గురువారం మెట్ పల్లి డీఎస్పీగా ఉమా మహేశ్వర రావు బాధ్యతలు స్వీకరించారు.. నూతన డీఎస్పీగా నియమితులైన ఉమా మహేశ్వర రావు గతంలో హైదరాబాద్ లోని సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహేశ్వర రావు మాట్లాడుతూ మహిళలపై నేరాలు జరగకుండా ప్రత్యేక ప్రత్యేక దృష్టి సారిస్తాన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రజల లక్ష్యంగా పోలీస్ స్టేషన్ స్థాయిలో అందరికీ న్యాయం జరిగేలా చేయటమే తమ ప్రథమ కర్తవ్యం అని తెలిపారు. గంజాయి నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.. రానున్న ఎన్నికల నైపద్యంలో ఎలక్షన్ కమిషన్ నియమావళి నిబంధనలోబడి పని చేస్తూ ముందుకు వెళ్తామని తెలిపారు ప్రజా సమస్యలపై అన్నివేళలా అందుబాటులో ఉంటానని అన్నారు.

డివిజన్ పరిధిలోని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, ప్రజా సంఘాలు, పోలీసులకు సహకరించాలని కోరారు.. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారి నైనా ఉపేక్షించేది లేదని డిఎస్పి అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం, గంజాయి, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రాబోయేది ఎలక్షన్ సీజన్ కావున డివిజన్ పరిధిలో నిగా ఎక్కువ ఉంటుందని, అల్లర్లకు, గొడవలకు దిగితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు.. ఎటువంటి గొడవలు జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతతో పోలీసులకు సహకరించాలని తెలిపారు జిల్లా ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ మెట్ పల్లి డీఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన ఉమామహేశ్వర రావు గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను ను అందజేశారు. మెట్ పల్లి డివిజన్ లో శాంతిభద్రతల పర్యవేక్షణకు పాటుపడాలని ఎస్పీ సూచించారు.

## థింక్ బిగ్ గ్లోబల్ సంస్థతో ఒప్పదం కుదర్చుకొన్న గొన్న ఇంజనీరింగ్ కళాశాల

**పరవాడ** పరవాడ మండలంలో ఉన్న స్థానిక గొన్న ఇంజనీరింగ్ కళాశాల థింక్ బిగ్ గ్లోబల్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంది.బుధవారం నాడు కళాశాలలో ఈ సంస్థ వారు విద్యార్థులకు ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గురించి పూర్తి అవగాహన కల్పించుటకై సెమినార్ ఏర్పాటు చేశారు.ఈ సెమినార్లో విద్యార్థులు అంతర్జాతీయ విద్య మరి భవిష్యత్తుకు ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలిపారు. అంతర్జాతీయ చదువుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

థింక్ బిగ్ గ్లోబల్ సంస్థ , గొన్న ఇంజనీరింగ్ కళాశాల తో చేసుకున్న ఒప్పదం ప్రకారం ఇంజనీరింగ్ కళాశాల లో స్టూడెంట్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ వంటి సేవలు నిర్వహించనుంది. ఈ సందర్భంగా గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హెంచంద్ నాయుడు ఈ ఎంఓయూ గురించి మాట్లాడుతూ ఈ ఒప్పందం కుదుర్చుకోవడం చాలా ఆనందంగా వుందని తెలియజేశారు. ఈ ఎంఓయూ తమ కళాశాల విద్యార్థుల వుజ్వల భవిష్యత్తు కొరకు మరియు ఉపాధ్యాయుల వృత్తి అభివృద్ధి కోసం చేసుకొన్నాము అని తెలిపారు. కళాశాల యాజమాన్యం ఎల్లవేళలా విద్యార్థుల మరియు ఉపాధ్యాయుల ఉన్నత భవిష్యత్తు కొరకు కృషి చేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయలు,సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వివాహిత దారుణ హత్య

**రాజమండ్రి** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ కడియం మండలం కడియపు సావరంలో దూళ్ళ సత్య శ్రీ (35) వివాహిత మహిళ దారుణ హత్యకు గురైంది. సత్యశ్రీ భర్త సూర్యప్రకాష్ (సూరిబాబు) హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

దంపతుల మధ్య గత మూడు నెలలుగా ఏర్పడిన వివాదమే హత్యకు దారితీసి ఉండొచ్చని స్థానికులు తెలిపారు. కాగా ఇరువురు దంపతులకు పెద్దల సమక్షంలో ఒప్పందం కుదిరించారు. వీరికి 16 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగిందని, ఒక పాప, బాబు సంతానం ఉండగా, పాప ఐదవ తరగతి, బాబు ఎనిమిదవ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని సౌత్ జోన్ డిఎస్పి అంబికా ప్రసాద్, కడియం సీఐ బి తులసీదర్ పరిశీలించారు. భర్త పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## వైసిపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు..

**- ప్రతి అడుగు ప్రజల కోసమే..**

**- తెలుగుదేశం ప్రభుత్వం రాగానే ప్రజలకు మరిన్ని సేవలు..**

**- కోవూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పోలం రెడ్డి దినేష్ రెడ్డి..**

**బుచ్చిరెడ్డిపాలెం :** రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం రాగానే నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ప్రజల కష్టాలు తీరుతాయని కోవూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పొలం రెడ్డి దినేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుదవారం ఆయన నగర పంచాయతీలోని 13వ వార్డులో ప్రతి ఇంటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నాయని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. తాగునీరు, డ్రైనేజీ, సమస్యలు ఉన్నాయన్నారు.రాష్ట్ర వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. ప్రభుత్వం ప్రజలపై ధరలబారాన్ని వేసిందన్నారు. నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయి అన్నారు. కరెంట్ బిల్లులను తొమ్మిది సార్లు పెంచిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పలువురు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బత్తల హరికృష్ణ , ఎంవీ శేషయ్య , చమకుల కృష్ణ చైతన్య,నెల్లూరు ప్రభాకర్ రెడ్డి నెల్లూరు దయాకర్ రెడ్డి, నెల్లూరు ద్వారకనాద్ రెడ్డి,సోము రామచంద్రారెడ్డి, సోము అనిత, ఎల్లారెడ్డి, వల్లూరు శ్రీనివాసులు, పూర్ణిమా రాదా, వనమా రాజేష్, తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో 20 మంది బస్సు ప్రయాణికులకు గాయాలు

**జంగారెడ్డిగూడెం** ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో 26 మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలకు వెళితే బుట్టాయిగూడెం మండలం దొరమామిడి గ్రామం నుంచి గురువారం ఉదయం జంగారెడ్డిగూడెంకు ఒక ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. జంగారెడ్డిగూడెం పట్టణ శివారులోని ఎస్సార్ బంక్ సమీపంలోకి వచ్చే సరికి ఈ బస్సును లారీ ఢీ కొట్టింది. దీంతో బస్సులోని 26 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కొంత మందిని మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన వారిలో స్కూల్ విద్యార్థులు ,వృద్ధులు కూడా ఉన్నారు. ఈ ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.తగాత్రులను పలువురు ప్రముఖులు పరామర్శించారు. పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు , కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు , జంగారెడ్డిగూడెం జడ్పిటిసి పోల్నాటి బాబ్జీలు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రోడ్డు ప్రమాదం జరగడానికి గల కారణాలపై ఆరా తీశారు. క్షతగాత్రులతో మాట్లాడి ఓదార్చారు. అంతేకాకుండా క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో ఇటువంటి సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. అదే విధంగా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

## శివకార్తికేయన్-ఏఆర్ మురుగదాస్

# సినిమా షూటింగ్ ప్రారంభం



కొలీవుడ్ లో లెజెండరీ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ తదుపరి చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.. శ్రీ లక్ష్మీ మూవీస్ నిర్మించిన అత్యంత భారీ అంచనాల చిత్రం, తారాగణం మరియు సిబ్బంది సమక్షంలో నిన్న లాంఛనంగా పూజా కార్యక్రమంగా ప్రారంభించబడింది. ఈ ఉదయం సినిమా షూటింగ్ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. తమిళ చిత్ర పరిశ్రమలో అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించినందుకు పేరుగాంచిన మురుగదాస్ దర్శకత్వం వహించిన టాప్ లీగ్ నటుడు శివకార్తికేయన్ నటించిన రాబోయే యాక్షన్ చిత్రం గురించిన వార్తలను విన్న అభిమానులు థ్రిల్ అయ్యారు. షూటింగ్ ప్రారంభమైనట్లు అధికారికంగా ధృవీకరించడం అభిమానుల ఆనందానికి అవధులు లేవనే చెప్పాలి.. ఏఆర్ మురుగదాస్ తన ప్రఖ్యాతి గాంచిన కథా కథన శైలిని ప్రదర్శిస్తూ, ప్రత్యేకమైన సెట్టింగ్‌తో చిత్రాన్ని రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ రాబోయే మాస్టర్‌పీస్ భారతీయ సినిమాకు సరికొత్త దృక్పథాన్ని పరిచయం చేస్తుంది, వినూత్న రంగాన్ని అన్వేషిస్తుంది మరియు అందరూ జరుపుకునే ఉత్తేజకరమైన యాక్షన్-ప్యాక్డ్ అనుభవాన్ని అందిస్తుంది. తమిళ చిత్ర పరిశ్రమలో వరుసగా బ్లాక్‌బస్టర్ హిట్‌లను అందజేస్తున్న నటుడు శివకార్తికేయన్ కెరీర్‌లో ఇది అతిపెద్ద మరియు గొప్ప చిత్రం. శివకార్తికేయన్ ఇంతకు ముందు చూసినట్లుగా కాకుండా పూర్తిగా ప్రత్యేకమైన మరియు స్టైలిష్ రూపాన్ని తెరపై ప్రదర్శిస్తారు. అతనితో చేరిన ప్రతిభావంతులైన కన్నడ నటి రుక్మిణి వసంత్, ఇప్పటికే దక్షిణ భారతదేశం అంతటా యువత హృదయాలను గెలుచుకున్నారు మరియు ఆమె అత్యంత అంచనాలు ఉన్న ఈ చిత్రంలో కథానాయికగా నటించనుంది. శ్రీ లక్ష్మీ మూవీస్ సంస్థ భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మ్యూజిక్ కంపోజర్ రాక్‌స్టార్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ సుదీప్ ఎలామన్ సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, అరుణ్ వెంజరమూడు కళా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి మాస్టర్ దిలీప్ సుబ్బరాయన్ కొరియోగ్రాఫ్ చే యనున్నారు. ఇక ఈ సినిమా ఫస్ట్ లెగ్ షూటిం గ్ ఇప్పటికే ప్రారంభమై శరవేగంగా సాగుతోం ది. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల గురించిత్వరలోఅధికారికప్రకటన వెలువడనుంది

## ఉత్తరాది బాక్సాఫీస్‌పై


# తెలుగు చిత్రాల దండయాత్ర




చిన్న గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన హనుమాన్, జాతీయ స్థాయిలో సంచలనాలు నమోదు చేస్తోంది. పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న టాప్ హీరోలు స్థాయిలో రేర్ రికార్డ్‌ను సెట్ చేసింది ఈ . దీంతో గతంలో ఇలాంటి రికార్డ్ క్రియేట్ చేసిన ల గురించి మాట్లాడుకుంటున్నారు ఫ్యాన్స్. సంక్రాంతి బరిలో బిగ్ కాంపిటీషన్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన హనుమాన్. మా కు లాంగ్ రన్ ఉంటుందని దర్శకుడు ప్రశాంత్ వర్మ ముందు నుంచే చెప్పారు. చిన్న గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన హనుమాన్, జాతీయ స్థాయిలో సంచలనాలు నమోదు చేస్తోంది. పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న టాప్ హీరోలు స్థాయిలో రేర్ రికార్డ్‌ను సెట్ చేసింది ఈ . దీంతో గతంలో ఇలాంటి రికార్డ్ క్రియేట్ చేసిన ల గురించి మాట్లాడుకుంటున్నారు ఫ్యాన్స్. సంక్రాంతి బరిలో బిగ్ కాంపిటీషన్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన హనుమాన్. మా కు లాంగ్ రన్ ఉంటుందని దర్శకుడు ప్రశాంత్ వర్మ ముందు నుంచే చెప్పారు. ఇప్పుడు ఆ మాటలను నిజం చేస్తూ అన్ బిలీవబుల్ రికార్డ్స్ క్రియేట్ చేస్తోంది ఈ ఫాంటసీ డ్రామా.పాన్ ఇండియా రేంజ్‌లో రిలీజ్ అయిన హనుమాన్ 30 రోజుల్లో 300 కోట్ల మార్క్‌ను క్రాస్ చేసింది. కేవలం హిందీలోనే 50 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. నార్త్ ఆడియన్స్‌కు కనెక్ట్ అయితే మన లకు ఏ రేంజ్ వసూళ్లు వస్తాయో మరోసారి ప్రూవ్ చేసింది హనుమాన్.బాహుబలి 2తో తెలుగు నార్త్‌లో సంచలనాలు నమోదు చేయటం మొదలైంది. బాహుబలి 2 బాలీవుడ్‌లో 50 కోట్ల మార్క్‌ను క్రాస్ చేసింది. ఆ తరువాత సాహో, సలార్, ఆదిపురుష్ లాంటి లతో ప్రభాస్, నార్త్ బాక్సాఫీస్‌లోనూ బాద్‌షాగా అవతరించారు. ట్రిపులార్ తో మరోసారి బాహుబలి 2 మ్యాజిక్‌ను రిపీట్ చేశారు రాజమౌళి. పుష్పరాజ్‌గా నార్త్ ఆడియన్స్ ముందుకు వచ్చిన అల్లు అర్జున్ కూడా సోలోగా రికార్డ్ వసూళ్లతో సత్తా చాటారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న పుష్ప 2తో అంతకు మించి బిగ్ నెంబర్స్‌ను టార్గెట్ చేస్తున్నారు.

## "ఊరు పేరు భైరవకోన"రిలీజ్‌కి

# తొలగిన అడ్డంకులు




సందీప్ కిషన్ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కిన "ఊరు పేరు భైరవకోన" సినిమా విడుదలను నిలుపుదల చేయాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో విశాఖపట్నంకు చెందిన ప్రముఖ ఫిలిం డిస్ట్రిబ్యూటర్ బత్తుల సత్యనారాయణ (వైజాగ్ సతీష్) కేసు వేసిన సంగతి తెలిసిందే. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్, ఎ.కె.ఎంటర్‌టైన్మెంట్స్ అధినేతలు, ప్రముఖ నిర్మాతలు అనిల్ సుంకర, గరికపాటి కృష్ణ కిషోర్ తనను నమ్మించి మోసం చేశారని బత్తుల సత్యనారాయణ (సతీష్, వైజాగ్ ) అందులో పేర్కొన్నారు. ఆ మధ్య వచ్చిన "ఏజెంట్ సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులు మూడు రాష్ట్రాలు అయిన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటకలకు ఐదు సంవత్సరాల పాటు తనకు చెందిన గాయత్రి దేవి ఫిలిమ్స్ కు అందజేస్తామని అగ్రిమెంట్ నాకు రాసిచ్చి, తన వద్ద నుంచి 30 కోట్ల రూపాయలు తీసుకుని, అగ్రిమెంట్ ప్రకారం హక్కులు ఇవ్వకుండా వారు మోసగించారని పేర్కొన్నారు. మూడు రాష్ట్రాలకు కాకుండా కేవలం విశాఖపట్నం జిల్లా వరకు మాత్రమే హక్కులు ఇచ్చారని, ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో తదుపరి సినిమా విడుదలకు ముందు నా డబ్బులు చెల్లిస్తామని, లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ ఇచ్చి కూడా వారు సమాధానం చెప్పడం లేదని అన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో నేను న్యాయం కోసం కోర్టుకు ఎక్కానని చెప్పారు. తన డబ్బులు ఇచ్చేంతవరకు సినిమా విడుదల కాకుండా స్టే విధించాలని కోరుతూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో గురువారం వాదనలు జరిగాయి. ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు న్యాయమూర్తి సినిమా మీద స్టే విధించే కేసును ఏప్రిల్ 12కి వేశారు. దీంతో ఇప్పటివరకు సినిమాకు ఉన్న అడ్డంకులు తొలగినట్టు అయింది.

## ఓటీటీలోకి రాబోతున్న

# ఎమోషనల్ లవ్ స్టోరీ



మణికందన్, శ్రీ గౌరిప్రియ హీరోహీరోయిన్లుగా నటించిన లేటెస్ట్ మూవీ ట్రూ లవర్..ఈ చిత్రానికి ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించాడు. తమిళంలో లవర్ పేరుతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మూవీని తెలుగులో ట్రూ లవర్‌గా డైరెక్టర్ మారుతి మరియు బేబీ ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ కలిసి రిలీజ్ చేశారు.యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ ఈ మూవీని తెరకెక్కించాడు. కాలేజీ రోజుల నుంచి అరుణ్ (మణికందన్), దివ్య (శ్రీగౌరిప్రియ) ప్రేమించుకుంటారు. ప్రతి విషయంలో దివ్యను అనుమానిస్తుంటాడు అరుణ్. ఆమె మరొకరితో క్లోజ్‌గా మాట్లాడినా అస్సలు సహించలేడు. అరుణ్ ప్రవర్తనకు విసిగిపోయిన దివ్య అతడికి బ్రేకప్ చెప్పాలని ఎన్నో సార్లు అనుకుంటుంది. దివ్య తన ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్లిన ఓ టూర్‌కు ఆమె వెంట అరుణ్ కూడా వెళతాడు..అక్కడ ఏం జరిగింది..అరుణ్‌లో మార్పు వచ్చిందా..దివ్య ప్రేమను అర్థం చేసుకున్నాడా.. అన్నదే ఈ మూవీ కథ. అపనమ్మకం మరియు అభద్రతా భావంతో కూడిన ఏ ప్రేమ నిలబడదనే పాయింట్‌తో దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ ఈ సినిమాను తెరకెక్కించాడు. ట్రైలర్ మరియు టీజర్స్‌తో ఈ మూవీ తెలుగు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ కలిగించింది. కానీ కథలో కొత్తదనం లేకపోవడంతో బాక్సాఫీస్ వద్ద పెద్దగా సందడి చేయలేకపోయింది. తమిళంలో మాత్రం డీసెంట్ కలెక్షన్స్ రాబడుతోంది.తమిళంలో లవర్ మూవీ రజనీకాంత్ లాల్ సలామ్ కలెక్షన్స్‌ను బీట్ చేసింది. ఆరు రోజుల్లో ఈ మూవీ పది కోట్ల వరకు గ్రాస్, నాలుగున్నర కోట్ల షేర్‌ను రాబట్టినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం.. ట్రూ లవర్‌లో నటించిన శ్రీ గౌరిప్రియ తెలుగు అమ్మాయి కావడం విశేషం.

## ఓటీటీలోకి వచ్చేసిన

# షారుఖ్ ఖాన్ 'డంకీ'




పఠాన్, జవాన్ వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుఖ్ ఖాన్ నటించిన సినిమా 'డంకీ'. రాజ్‌కుమార్ హిరానీ తెరకెక్కించిన ఈ చిత్రం తాప్సీ పొన్ను హీరోయిన్‌గా నటించగా.. విక్కీ కౌశల్, బొమన్ ఇరానీ ప్రధాన పాత్రల్లో నటించారు. గతేడాదిలో ప్రభాస్ 'సలార్'కు పోటీగా డిసెంబర్ 21న డంకీ విడుదలైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన డంకీ బాక్సాఫీస్ వద్ద పర్వాలేదు అనిపించినా.. పఠాన్, జవాన్ చిత్రాల రేంజ్‌లో మెప్పించలేకపోయింది. రూ. 470 కోట్ల కలెక్షన్స్ వద్ద డంకీ ఆగిపోయింది. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. డంకీ సినిమా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. నిజానికి ఈ సినిమా జనవరిలోనే ఓటీటీలోకి రావాల్సి ఉంది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే.. నెట్‌ఫ్లిక్స్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి తెచ్చింది. గురువారం (ఫిబ్రవరి 15) అర్ధరాత్రి నుంచి డంకీ సినిమా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చేసింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన కొద్ది గంటల్లోనే నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ మూవీస్ లిస్ట్‌లో ఈ సినిమా చేరడం విశేషం.నెట్‌ఫ్లిక్స్‌లో టాలీవుడ్ సినిమాలు సలార్, గుంటూరు కారం, హాయ్ నాన్న టాప్ టెన్‌లో కొనసాగుతున్నాయి. ఇప్పుడు డంకీ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో ఎలాంటి సంచలనాలు క్రియేట్ చేస్తుందో చూడాలి. డంకీ సినిమా ప్రపంచవ్యాప్తంగా కేవలం హిందీలోనే విడుదల అయింది. ఇప్పుడు కూడా హిందీలోనే స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చేసింది. అయితే ఇంగ్లిష్ సబ్ టైటిల్స్‌తో ఆడియెన్స్ చూడొచ్చు.

## ఫీమేల్ ఓరియంటెడ్‌లకూ

# సీక్వెల్స్ సిద్ధం



ఇండస్ట్రీలో వంద కోట్ల స్టామినా మేల్ ఓరియంటెడ్ కమర్షియల్ లకే ఉంటుందా? అంటే, వెంటనే యస్ అనే మాట వినిపిస్తుంది. స్టోరీలో సత్తా ఉంటే, ఫీమేల్ ఓరియంటెడ్ లూ ఆ రేంజ్‌లో కలెక్ట్ చేయొచ్చని అంటున్నారు ట్రేడ్ పండిట్స్. కథల మీదా, కమర్షియల్ సక్సెస్ మీద, ప్రేక్షకాదరణ మీదా ఉన్న నమ్మకంతోనే ఫీమేల్ ఓరియంటెడ్ లకూ సీక్వెల్స్ సిద్ధం చేయడానికి మేకర్స్ ముందుకొస్తున్నారన్నది వారి మాట. భామా కలాపం చూసిన వారందరూ ఎక్సలెంట్ రైటింగ్ అని మెచ్చుకున్నారు. ప్రియమణికి టైలర్ మేడ్ కేరక్టర్ అన్నారు. అందుకే ఆహా ఓటీటీలో అద్భుతమైన సక్సెస్ అందుకుంది భామా కలాపం. ఆ కు వచ్చిన స్పందన చూసిన మేకర్స్ వెంటనే సీక్వెల్ మీద ఫోకస్ చేశారు. బామా కలాపం2 ఇప్పుడు ట్రెండింగ్ టాపిక్. ప్రమోషనల్ కంటెంట్‌లో ప్రతి డైలాగూ ఎంటర్‌టైనింగ్‌గా ఉంది... ఆహాలో ఈ నెల 16న విడుదల కానుంది బామా కలాపం2. అంజలి హీరోయిన్‌గా నటించిన గీతాంజలి. హారర్ జోనర్‌లో ఈ అప్పట్లో పెద్ద విజయాన్ని అందుకుంది. ఇప్పుడు అదే జోనర్‌ని కంటిన్యూ చేస్తూ ఆమె నటిస్తున్న గీతాంజలి మళ్లీ వచ్చింది. ఈ సారి ఈ కథలో ఇంకేం ఎలిమెంట్స్ ని పొందుపరుస్తారోననే ఆసక్తి ఈ జోనర్ లవర్స్ లో బాగానే కనిపిస్తోంది. ఈ మధ్య రీఎంట్రీలో మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టితో మంచి హిట్ అందుకున్నారు అనుష్క. ఆమె నటించిన భాగమతికి సీక్వెల్ చేస్తామని ఆల్రెడీ ప్రకటించారు మేకర్స్. ప్రస్తుతం ఓ మలయాళ షూటింగ్‌లో ఉన్నారు అనుష్క శెట్టి. అది పూర్తికాగానే భాగమతి ప్రాజెక్టులో ఇన్వాల్వ్ అవుతారన్నది ఫిల్మ్ నగర్ న్యూస్. ఇటు సమంత కూడా ఫ్యామిలీమేన్3కి ప్రిపేర్ అవుతున్నారు. వెబ్ సీరీస్ పరంగానే కాదు, పరంగానూ ఆమె ఖాతాలో ఓ సీక్వెల్ ఉంది. మయోసైటిస్ సోకడానికి ముందు ఆమె నటించిన యశోద. ఈ కు సీక్వెల్ చేసే ఆలోచనలున్నాయని గతంలో మేకర్స్ హింట్ ఇచ్చారు. ఇప్పుడు సమంత కమ్‌బ్యాక్ టైమ్‌లో ఆ ప్రాజెక్టు మీద కూడా హోప్స్ పెంచుకుంటున్నారు సామ్ ఫ్యాన్స్.

# రీమేక్‌ల తీరుపై చర్చ

సౌత్‌లో సూపర్ హిట్ అయిన లను నార్త్‌లో రీమేక్ చేయటం అన్నది ఎప్పటి నుంచో జరుగుతున్నదే. అయితే ఆ రీమేక్ చేస్తున్న తీరు మీదే ఇప్పుడు చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇక్కడ ఎమోషనల్ డ్రామాలుగా తెరకెక్కిన లను హిందీలో యాక్షన్ లుగా మార్చి సోల్‌ను దెబ్బ కొడుతున్నారన్న కంప్లయింట్స్ వినిపిస్తున్నాయి. తాజాగా రిలీజ్‌కు రెడీ అవుతున్న మూవీ విషయంలోనూ ఇదే జరుగుతోంది. విజయ్ హీరోగా తమిళ్‌లో సూపర్ హిట్ అయిన మూవీ తెరి యాక్షన్ డ్రామానే అయినా ఈ లో తండ్రీ కూతుళ్ల రిలేషన్, లవ్ స్టోరీ హైలెట్ అయ్యాయి. ఇప్పుడు ఈ ను హిందీలో బేబీ జాన్ పేరుతో రీమేక్ చేస్తున్నారు. ఈ లో బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అంటూ ప్రమోట్ చేస్తున్నారు మేకర్స్.కార్తీ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ ఖైదీ. తెలుగు, తమిళ భాషల్లో సూపర్ హిట్ అయిన ఈ ను హిందీలో భోళా పేరుతో రీమేక్ చేశారు. బాలీవుడ్ సీనియర్ స్టార్ అజయ్ దేవగన్ స్వయంగా నటించి దర్శకత్వం వహించిన ఈ మూవీ విషయంలో కూడా యాక్షన్ మెయిన్‌గా హైలెట్ అయ్యింది. భోళాలో ఎమోషన్స్ కన్నా యాక్షన్ పార్ట్‌కే ఎక్కువగా ఇంపార్టెన్స్ ఇచ్చారు మేకర్స్. ఒరిజనల్ వర్షన్‌లో రెండు, మూడు సాలిడ్ యాక్షన్ సీన్స్ మాత్రమే ఉన్నాయి. మిగతా అంతా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఎమోషనల్ డ్రైవ్‌లా సాగుతుంది. కానీ ఖైదీ నార్త్ వర్షన్‌ను పూర్తిగా మార్చేశారు మేకర్స్. విజువల్స్ పరంగా భోళా గ్రాండ్‌గా అనిపించినా... ఖైదీలా మనసును తాకలేదన్న కామెంట్స్ వినిపించాయి. గతంలోనూ కొన్ని సౌత్ లను ఇలాగే యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌గా మార్చేశారు నార్త్ మేకర్స్. ముఖ్యంగా టైగర్ ష్రాఫ్ హీరోగా నటించిన సౌత్ రీమేక్స్ విషయంలో ఇలాంటి మార్పులు ఎక్కువగా జరుగుతున్నాయి. సౌత్‌లో సూపర్ హిట్ అయిన వర్షం, క్షణం, తడాకా లను హిందీలో రీమేక్ చేసిన టైగర్.. ఆ ల్లో కథ మొత్తాన్ని పక్కన పెట్టేసి యాక్షన్ సీన్స్‌తో నింపేశారు. ఇప్పుడు బేబీ జాన్ విషయంలోనూ అదే జరుగుతుండటంతో ఈ రిజల్ట్ విషయంలో అనుమానాలు కలుగుతున్నాయి.

# వచ్చేది అగ్ని ప్రమాదాల కాలం

## - అప్రమత్తతే ప్రధానం

- అగ్ని ప్రమాధాలపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి
- అగ్నిమాపక శకటాల సంఖ్యను పెంచి అందుబాటులో ఉంచాలి
- రాష్ట్ర వ్యాప్తంగా శకటాలలో నీటిని నింపి అప్రమత్తంగా ఉంచాలి
- పాఠశాలలు, మాల్స్ లో అగ్నిమాపక నివారణ చర్యలను పర్యవేక్షించాలి
- అగ్ని ప్రమాధాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి బాధ్యతగా వ్యవహరిస్తే అస్థి,ప్రాణనష్టాన్ని నియంత్రించవచ్చు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వేసవి కాలంలో ఆరంభమవడంతో అగ్ని ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి. అగ్ని ప్రమాదాలు వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలోనే ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుంది. వేసవి ప్రారంభంలోనే భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తు సెగలుకక్కుతుండగ నిత్యం పెరుగుతున్న ఎండ తీవ్రత ధాటికి ఏదో ఒక ప్రాంతంలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంక ఫిబ్రవరి నెల దాటక ముందే భనుడి భగభగలకు అగ్ని ప్రమాదాలు పెరుగనున్న నేపద్యంలో ప్రభుత్వం అప్రమత్తమై ముందు జాగ్రత్త చర్యలు పాటించి అగ్ని మాపక వాహణాలను, సిబ్బందిని కర్యోన్ముకులుగా సిద్దం చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది. కాని క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అవసరమైన మేరకు అగ్ని మాపక వాహణాల కొరత, నిర్వహణ ఒక ఎత్తు కాగ వాహణాలలో నీటిని నింపుకోవడం గగనమై పోయింది.

అగ్ని మాపక కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటే ప్రమాధాలలో ఆస్థి,ప్రాణ నష్టాన్ని ఘణనీయంగా నియంత్రించవచ్చు. కాని నేడు ఆ పరిస్థితులు కనుచూపు మేర కనిపిస్తలేవు. నేడు మండల కేంద్రాలు అటుంచి కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాలలోనె అగ్ని మాపక కేంద్రాలు లేవు. అగ్ని ప్రమాధాలు జరిగితే ఎక్కడో వంద కిలోమీటర్ల దూరం నుండి శకటం నీళ్ళు నింపుకొని ప్రమాధ స్థలానికి చేరే వరకు జరిగి పోయే నష్టం జరిగిపోతుంది. ఇక గ్రామీణ ప్రాంతాలలో అయితే మరీ దారుణం. ఇదిలాఉండగా నగరం నడిబోడ్డున అగ్ని ప్రమాధాలైతే అక్కడికి శకటాలు చేరుకోవడానికి గంటల సమయం పడుతుంది దీంతో భారీగా అస్థి, ప్రణనష్టం జరిగి పోవడం వంటి సంఘటనలు లెక్కకు మించి ఉన్నాయి. దీనికి నిదర్శనం గత బుదవారం నాడు సాయంత్రం పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు పక్కనే ఉన్న స్వయంవరం బట్టల షాఫ్ ముందు భారీ అగ్నికీలలో కాల పోతున్న కారు (టిఎస్ 07యూఏ 9570) రిచ్జ్ ఉదంతం ఒక ఉదాహరణ. కారణమేదైనను భారీ మంటల్లో దగ్దమవుచున్న కారు క్షణాలో పూర్తిగా బూడిదై పోయింది. ఈ ఘటనలో మంటల నుండి కాపాడడం అటుంచి కనీసం అగ్ని మాపక కేంద్రానికి సమాచార మివ్వడానికి కూడా ఎవరు ముందుకు రాకపోగా అక్కడ గుమికూడిన వందలాది మంది సంఘటనను తమ సెల్ పోన్ లలో చిత్రికరించుకోవడంలో నిమగ్నమవడం గమనార్హం. అగ్ని ప్రమాధాలు సంభవించిన వెంటనే ప్రమాద స్థాయిని అంచనా వేసుకొని పౌరులు వెంటనే భాద్యతాయుతంగా వ్యవహరిస్తే జరిగే నష్టం స్థాయిని తగ్గించ వచ్చు. ఇలాంటి సమయంలో అధికారులకు ఎంత భాధ్యత ఉందో ప్రతి పౌరునికి కూడా అంతే భాధ్యత ఉందనే విషయాన్ని మరచిపోవద్దు. ఇక ప్రభుత్వ విషయానికి వస్తే అగ్ని ప్రమాధాల నివారణపై, ముందు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే రాష్ట్రంలో అగ్ని మాపక శకటాల సంఖ్య ఘననీయంగా పేంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అగ్ని ప్రమాదం జరిగిన కొన్ని క్షణాలలో శకటం ఆ ప్రాంతానికి చేరుకొనే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అల గే ప్రతి శకటంలో నీటిని నింపి అనుక్షణం సిద్దంగా ఉంచాలి.

### అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

వంట గది, పంట చేలు, షాపింగ్‌మాల్స్, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ఆఫీసులు, పెట్రోల్‌బంకులు, ఇలా స్థలమేదైనా సరే అప్రమత్తంగా ఉండాల్సిందే సహజంగా వేసవిలోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటయి. ప్రధానంగా గ్రామాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయ పనులు ముగియడంతో ఆయా పంటచేనులో ఎండిన గడ్డి, ఇతర పంట వ్యర్థాలను కాల్చి వేస్తుంటారు. ఈ సమయంలో జాగ్రత్తలు పాటించక పోతే గాలికి నిప్పురవ్వలు ఎగిరి సమీపంలో ఉన్న గడ్డివాములు, ఇంటి పరిసరాల్లో పడితే మంటలు దావనంలా వ్యాప్తి చెందుతాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే ఎక్కువగా విద్యుత్ సంబంధిత అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ప్రధానంగా ఎండ తీవ్రతను తట్టుకునేందుకు షాపింగ్‌మాల్స్, ఆసుపత్రులు, ఇతర వ్యాపార సముదాయాలతో పాటు నివాసాల్లో ఏసీలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణలు షాట్ సర్క్యూట్‌కు గురై మంటలు వ్యాపిస్తుంటాయి. ఇలా అగ్ని ప్రమాదం ఏ రూపంలో ఉన్నప్పటికీ ఆస్తినష్టంతో పాటు ప్రాణనష్టము వాటిల్లుతుంది. అందుకే వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంత్తైన ఉంది.

### అగ్ని ఉపయోగమ పొరబడితేనే ప్రమాదం

అగ్ని మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుందనే మాట వాస్తవమైనప్పటికి దానిని ఉపయోగించడంలో ఏ మాత్రం పొరపాటు చేసిన అది ఎంతో ప్రమాదం కలుగజేస్తుందనేది అక్షర సత్యం.

చిన్న నిప్పురవ్వను అలక్ష్యం చేసినచో అది మనకు ఘోరమైన నష్టాన్ని కలిగిస్తుంది. ప్రాణ, ఆస్తి నష్టంతో పాటు దేశ సంపద ధ్వంసం కావచ్చు. అగ్ని విషయంలో ఏ మాత్రం అజాగ్రత్త పనికిరాదు అని పెద్దలు హెచ్చరిస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాల్లో భారీ ప్రమాదాలు జరగకుండా కాపాడడం అగ్నిమాపకశాఖ ప్రధాన లక్ష్యం. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు కంగారుపడి మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి. వెంటనే సమీపంలో ఉన్న అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించాలి

### పాఠశాలలు, ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్‌లో

పాఠశాలలు, షాపింగ్‌మాల్స్, ఆసుపత్రుల్లో ఆర్‌సీసీ, కాంక్రీట్ శ్లాబులను మాత్రమే పై కప్పుగా వాడాలి. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. సెల్లార్లలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్స్‌ను ఉపయోగించాలి. స్కూల్స్, హాస్పిటల్స్‌లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు క్షేమంగా తప్పించుకునేందుకు సరైన ప్రణాళికను రచించి అది అందరికి తెలిసే విధంగా అప్రమత్తం చేయాలి. షాపింగ్‌మాల్స్‌లో ఎలక్ట్రికల్ సామగ్రిని ఐఎస్‌ఐ మారు కలిగిన వాటిని మాత్రమే వాడాలి. ఆసుపత్రులు, సూల్స్ నుంచి బయటికి వెళ్లు మార్గాలలో మెట్లు, తలుపు వద్ద ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కి సమాచారం అందించాలి. తాటాకులు, గడ్డితో చేసిన పై కప్పును పాఠశాలలు, ఆసుపత్రులకు వాడరాదు. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు అగ్నిప్రమాదం సంభవించకుండా మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్స్‌ను అమర్చుకోవాలి. పరిసరాలు శుభ్రతను పాటించాలి, అవరణంలో చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలి, అగ్ని ప్రమాదం జరుగుటకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను ముందుగా గుర్తించి ఆ ప్రాంతాలను ప్రమాదరహితం చేయాలి.

### నివారణ పద్ధతులు

ఇంట్లో వస్తువులను అల్మారాల్లో, సెల్ఫ్‌ల్లో సక్రమంగా సర్దుకొని ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, పటాకులు, ఇతర మండే వస్తువులు, పేలుడు పదార్థాలు ఏవీ అందుబాటులో ఉంచరాదు. కాల్చిన సిగరెట్లు, బీడీలు, చుట్టలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా బయటకు పారవేయరాదు. ఐఎస్‌ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలనే ఉపయోగించాలి. పాడైన వైర్లను వాడొద్దు. ఓవర్ లోడ్ చేయవద్దు. ఎలక్ట్రికల్ సాకెట్ నందు కెపాసిటీకి తగిన ప్లగ్‌ను మాత్రమే వాడాలి. పకమీద పడుకుని పొగతాగవద్దు. ఇంటి నుంచి ఎకువ రోజులు సెలవులకు బయటికి వెళ్లినప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్ ఆఫ్ చేయాలి. పటాకులు కాల్చేటప్పుడు నైలాన్, పాలిస్టర్ దుస్తులు ధరించాలి. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే అర్పడానికి ఎల్లవేళలా నీటిని ఇంట్లో నిల్వ ఉంచాలి.

# మేడారం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- అన్ని విధాల ఏర్పాట్లు చేసిన అధికారులు
- ప్లాస్టిక్ రహితంగా జాతర నిర్వహించాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క వెల్లడి
- వన దేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క
- పాల్గొన్న మేడారం ట్రస్ట్ బోర్డు నూతన కమిటీ
- మేడారం ట్రస్ట్ బోర్డు కమిటీ ప్రమాణస్వీకారం




**మేడారం (ప్రశ్న న్యూస్):** మేడారం లో నూతనంగా ఏర్పాటైన మేడారం ట్రస్ట్ బోర్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడారం జాతర కు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం చేసిందని గత నెలరోజులుగా భక్తులు లక్షలాదిగా తల్లులను దర్శించుకోవడానికి వస్తున్నారని జాతర సమీపిస్తున్న నేపథ్యంలో మా అధికారులు అన్ని విధాలుగా సిద్దంగా ఉన్నారని నూతన కమిటీ చైర్మన్ మరియు డైరెక్టర్లు అందరినీ సమన్వయము చేసుకొని జాతర విజయవంతం చేయాలి అని చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన ఆరెం లచ్చు పటేల్ తో పాటు డైరెక్టర్లకు రాష్ట్ర మంత్రి వర్యులు డాక్టర్ సీతక్క శుభా కాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ద బోయిన జగ్గారావు తో పాటు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ గారు మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు గురువారం మేడారంలోని హరిత హెూటల్ సమావేశం మందిరంలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యం లో పారిశుధ్య నిర్వహణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి అనసూయ సీతక్క, పంచాయతి రాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతర సమయం దగ్గర పడుతున్న తరుణంలో భక్తుల తాకిడి రోజురోజుకి పెరుగుతుంది కాబట్టి అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని అన్నారు. భక్తులకు ముఖ్యంగా నిరంతరం త్రాగు నీరు అందిచలని అన్నారు. జాతర లో జాతర ముగిసిన అనంతరం కూడా ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగించాలని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన పంచాయతీరాజ్ కమిషనర్ మాట్లాడుతూ జాతరలో విధులు నిర్వర్తించే అధికారులు చిత్త శుద్ధి తో సమన్వయంతో సేవలు అందించాలని జాతరలో ముఖ్యంగా గద్దెల ప్రాంగణంలో బెల్లం కొబ్బరికాయలు శుభ్రం చేయాలని అలాగే జంపన్న వాగు సమీపం లో భక్తుల తలనీలాలు కూడా శుభ్రం చేయాలని అన్నారు. పారిశుధ్య సిబ్బంది మిషనరీ యంత్రాల ద్వారా నిరంతరం విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి జాతర విధులుకు వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా 19 తేదీన సంబంధిత జోనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలి అని అన్నారు. జాతర లో పారిశుధ్య పనులు చేయడం కోసం 10 సెక్టార్లు, 60 సబ్ సెక్టార్స్ గా విభజించడం జరిగింది అని డి పి ఓ, డి ఎల్ పి ఓ ల ఆధ్వర్యం లో పారిశుధ్య పనులు జరుగుతాయని ఫీల్డ్ లో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. అదనపు కలెక్టర్ పి శ్రీజ మాట్లాడుతూ అధికారులకు కేటాయించిన జోన్ లలో విధులు నిర్వహించాలని ప్రతి జోన్ కు ఎం పి ఓ స్థాయి అధికారి నీ కేటాయించడం జరిగింది అని జాతర సమయంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శబరిష్ , డి పి ఓ లు , డి ఎల్ పి ఓ, వివిధ జిల్లాల జోనల్ అధికారులు పాల్గొన్నారు.

# డిప్యూటీ మేయర్ డివిజన్‌లో అక్రమ షెడ్లపై చర్యలేవి.?

- నోటీసులు జారీ చేసి కూల్చివేసేడం మరిచిపోయారా.?
- టౌన్ ప్లానింగ్ అధికారులకు మామూళ్లు ఇస్తే రహదారులపై షెడ్లు వేసుకోవచ్చా.?
- డిప్యూటీ మేయర్ డివిజన్లోనే ఇంత అక్రమాలు అయితే ఇక ఇతర డివిజన్ల పరిస్థితి ఏమిటి.?
- జిహెచ్‌ఎంసిలో అవినీతి అక్రమాలపై ఉన్నత అధికారులు స్పందించరా. ?




ప్రజాప్రశ్న

డిప్యూటీ మేయర్ ఇలాకాలో పుట్టగొడుగుల్లా అక్రమ షెడ్లు

తార్నాక (ప్రశ్న న్యూస్)తార్నాక డివిజన్ పరిధిలో అక్రమ షెడ్లకు కొదవ లేకుండా పోయింది. సాక్షాత్ డిప్యూటీ మేయర్ డివిజన్ లో అక్రమ షెడ్లు దర్శనమిస్తున్నాయి. అయిన అధికారులు మాత్రం కూల్చివేతలు చేయకుండా నోటీసులు జారీ చేసి చోద్యం చూడడం పరిపాటిగా మారింది. ఈ అక్రమ షెడ్ల వెనుక రాజకీయ నాయకుల హస్తం ఉందంటూ కూల్చివేతలు చేయకుండా మౌనవ వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు మామూళ్లకు అమ్ముడుపోయి అక్రమ షెడ్లపై చర్యలు తీసుకోవడం మానేశారని ఎవరైనా ప్రశ్నిస్తే నోటీసులు జారీ చేశామంటూ నెలలు గడుపుతున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. జనావాసాల మధ్య అక్రమ షెడ్లకు అనుమతి ఇవ్వరు అయితే అధికారులు ఫిర్యాదుదారులను పట్టించుకోకుండా అక్రమ నిర్మాణదారులతో చేతులు కలుపుతున్నారని సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షాత్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్న డిప్యూటీ మేయర్ మౌనం వెనుక అర్థం ఏమిటని తన డివిజన్ పరిధిలో అక్రమ షెడ్లను కూల్చివేయాలని డిప్యూటీ మేయర్ ఆదేశించకపోవడం వెనక ఆమె హస్తం ఉందని సుధాకర్ ఆరోపించారు. డిప్యూటీ మేయర్ ఇంటికి కూతవీడు దూరంలోనే అక్రమ షెడ్లు వెలవడం విడ్డూరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారులు గత వారం ఫుట్ పాత్ ల ఆక్రమణ పేరుతో హడావుడి చేసి కూల్చివేతలు



చేశారు కానీ పరిస్థితి మళ్ళీ యధాతథంగా మారడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నామమాత్రంగా ఫుట్ పాత్ ల ఆక్రమణలు తొలగించారని అక్రమ నిర్మాణాల విషయంలో కూడా అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఏకంగా తార్నాక చౌరస్తాలో అక్రమ షెడ్డు వెలసిన అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా మారింది

ఇదే కాకుండా సన్మాన్ హెూటల్ పక్కన పెట్రోల్ బంక్ యజమాని ఫుట్ పాత్ ను, రోడ్డును కబ్జా చేసి ర్యాంపు నిర్మాణంతోపాటు రహదారిపై గోడను ఏర్పాటు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరేతనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. రోడ్డు కబ్జా చేసిన పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రజలకు ఏరకంగా ఉపయోగపడటం లేదని వాళ్ళ జేబులు నింపుకోవడానికి తప్ప వాళ్ల వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని సుధాకర్ ఆరోపించారు. ఇప్పటికైన ఉన్నత అధికారులు స్పందించి అక్రమ షెడ్లను వెంటనే తొలగించాలని అలాగే రోడ్డును ఫుట్ పాత్ ను కబ్జా చేసిన వాళ్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588